క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్యమఠం ఆవరణలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్.రామలింగారెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 30వ తేదీ ఉదయం అంకురార్పణ, నవకలశస్నపనం, 31న ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ఠ, సాయంత్రం శేషవాహనంపై గ్రామోత్సవం, జూన్ 1న ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, సాయంత్రం ఎదురుకోలు, 2న ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం హనమంత వాహనసేవ, 3న ఉదయం మూలమూర్తిహోమం, ఉత్సవబలి, సాయంత్రం గరుడవాహనంపై గ్రామోత్సవం, 4వ తేదీన ఉదయం అశ్వవాహనసేవ, చక్రస్నానము, సాయంత్రం ధ్వజావరోహణం, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

పోరుమామిళ్ల: స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం లైబ్రేరియన్ ఆఫ్రిది నేతృత్వంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు దాదాపీర్ ఆధ్వర్యంలో సమ్మర్‌క్యాంప్ కొనసాగుతోంది. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు, వారిలో పోటీతత్వం పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు దాదాపీర్ పేర్కొన్నారు. డ్రాయింగ్ పోటీల్లో ఎంపిక చేసి క్యాంప్ చివరి రోజున బహుమతులు ఇస్తామన్నారు. ఉపాధ్యాయులు మహమ్మద్ రఫి, పీర్‌బాషా పాల్గొన్నారు.

వైభవంగా మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న వేద పండితులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మరకత లింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలోని శ్రీఅమృతేశ్వర స్వామి ఆలయంలో గురువారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మరకత లింగేశ్వరుడికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తి పీఠాలకు, నవరత్న లింగాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, రక్షాబంధనం, ధ్వజారోహణ, కలశస్థాపన, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవ ఉంటుందని, స్వామి, అమ్మవారులను దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ కొవ్వూరు రమేష్ రెడ్డి కోరారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి నామా శ్రీనివాసులు, సభ్యులు వినోద్ పాల్గొన్నారు.

ఆత్మస్తుతి పరనిందకే 'మహానాడు'


మైదుకూరు : కడపలో టీడీపీ నిర్వహించిన మహానాడు ఆత్మ స్తుతి పరనిందకే పరిమితమైందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకసుబ్బారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చినట్లు భ్రమలు కల్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. మహానాడులో మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలు గుప్పిస్తూ.. పైశాచిక ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు.

జాబ్‌మేళా వాయిదా

కడప కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని మైదుకూరులో శుక్రవారం జరగాల్సిన జాబ్‌మేళాను అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగో సింహంపై నాయకుల పెత్తనం!

- పోలీస్ విధులకు అడ్డుపడుతున్న కూటమి నాయకులు
- నిజాయితీగా పని చేసే వారిపై ఫిర్యాదు
- మేము చెప్పిందే చేయాలంటున్న నేతలు



బద్వేలు : 'కరవమంటే కప్పకు కోపం.. వదలమంటే పాముకు కోపం' అన్నట్టుగా తయారైంది.. బద్వేలు పోలీసుల పరిస్థితి. వారి తలపై ఉండే మూడు సింహాలు.. చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైతే.. యూనిఫాం ధరించి ప్రజల కోసం పని చేసే పోలీసును నాలుగో సింహంగా భావిస్తుంది సమాజం. అలాంటి నాలుగో సింహం ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్ల మధ్య సతమతం అవుతోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, నాయకుల బెదిరింపులు, హెచ్చరికల మధ్య నలిగిపోతోంది. నిజాయితీగా పని చేసే పోలీసులపై గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకులు బద్వేలులోని ప్రముఖ నాయకుడికి ఫిర్యాదులు చేస్తుండటంతో.. బాధితులకు న్యాయం చేయలేని పరిస్థితులు పోలీసుల్లో నెలకొన్నాయి.

బాధితులకు న్యాయం చేయలేక..

బద్వేలు నియోజకవర్గంలో పోలీసు భయం అనేది అధికార పార్టీ నాయకులు బలహీనంగా భావిస్తున్నారు. నిజమైన బాధితులకు న్యాయం చేయలేక పోలీసులు తల పట్టుకుంటున్నారు. ఒక వేళ పోలీసులు సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటే.. వెంటనే అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగుతారు. దీంతో బాధితులకు న్యాయం జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. 2024 అక్టోబర్ 30న బద్వేలు డివిజన్ పరిధిలో తంగేడుపల్లె గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు వెంకట సుబ్బయ్యకు చెందిన ఐదెకరాల పండ్ల తోట(మామిడి, జామ, కొబ్బరి, టేకు)లో 580 చెట్లను టీడీపీకి చెందిన వారు నరికేశారు. అంతేగాకుండా పొలంలో ఉన్న షెడ్డును కూడా కూలదోశారు. అయినా ఇప్పటి వరకు అతనికి న్యాయం జరుగలేదు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని బద్వేలు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోపాలస్వామిపై తప్పుడే కేసు నమోదు చేయించి జైలు పాలు చేశారు.

మద్యం మత్తులో హల్‌చల్

బద్వేలు పట్టణంలో కొందరు బహిరంగంగా మద్యం తాగుతూ గంజాయి మత్తులో మునిగితేలుతున్నారు. సామాన్య జనం అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్న మరుక్షణమే.. అధికార పార్టీ నేతలు పోలీసులపై ఒత్తిడి పెంచి విడిపించుకుపోతున్నారు. నాయకుల అండతో మందుబాబులు చెలరేగిపోతున్నారు. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించి.. వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచేవారు. ఇప్పుడు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు పట్టుకున్నా.. అధికారపార్టీ నాయకులు అడ్డుపడుతున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి.

'ఏసీఆర్'కు ఏదీ విలువ?

గతంలో పోలీసు బదిలీల్లో సమర్థతకు పెద్ద పీట వేసేవారు. ఇందులో ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు) చాలా కీలకం. ఇప్పుడు ఏసీఆర్‌తో పనేలేదు. పోస్టింగ్‌లన్నీ పొలిటికల్ పోస్టింగులే. ఫలానా చోట ఫలానా ఎస్ఐ.. ఫలానా సీఐ కావాలి అని అధికారాపార్టీ నేతలే నిర్దేశిస్తున్నారు. ఉన్నతాధికారులు వాటిని అమలు చేస్తున్నారు. ఫలితంగా సమర్థతకు నీతి, న్యాయానికి గౌరవం లేకుండా పోయింది. ఒకప్పుడు నియోజకవర్గంలో మంత్రి పర్యటిస్తేనే సీఐ స్థాయి అధికారి ఎస్కార్టుగా వెళ్లేవారు. పరిస్థితులు మారిపోయాయి. పోలీసులను వెంట పెట్టుకుని తిరగడం అధికార పార్టీ నాయకులకు ఫ్యాషన్ అయిపోయింది. ఎంఎల్ఏ, ఎంపీ, ఎంఎల్సీ వచ్చినా.. డీఎస్పీ స్థాయి అధికారి వెంట నడవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలా పోలీసులను అధికారపక్షం నాయకులు వాడుకోవడంతో పోలీసు శాఖ పట్ల ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.

మేము తెచ్చిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయండి

- మా కుటుంబం జీవితాంతం వైఎస్ కుటుంబానికే అండగా ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన అభివృద్ధి పథకాలను కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన గురువారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాచమల్లు ఘాటుగా స్పందించారు. ప్రవీణ్‌వి ఉత్తర కుమారుని ప్రగల్భాలని రాచమల్లు ఎద్దేవాచేశారు. ప్రవీణ్ కుమార్‌రెడ్డి కాదు కదా రాష్ట్రంలో ఎవ్వరూ తమ ఇంటికి టీడీపీ జెండాను కట్టే వారే లేరని స్పష్టం చేశారు. నారా లోకేష్ టికెట్ ఇస్తామని చెప్పారని.. టీడీపీ టికెట్ కాదు కదా ఆయనకు కనీసం రిలీజ్ సినిమా టికెట్ అయినా ఇచ్చారా అని ఎద్దేవా చేశారు. అసంబద్ధమైన మాటలు మాట్లాడటం సరికాదని, కోగటం వాళ్ల పరిస్థితి ఏమిటో తనకు తెలుసునన్నారు. ఊపిరి ఉన్నంత వరకు వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని, తన తర్వాత తన తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు రక్షణ కవచంగా నిలబడతారన్నారు. కడపలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి టీడీపీ జెండా కట్టిన వారు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సుమారు 50 ఏళ్ల పాటు రామేశ్వరం ప్రాంత ప్రజలు తమ కుటుంబ సభ్యులను వరుసగా కౌన్సిలర్‌గా గెలుపిస్తున్నారని చెప్పారు. రెండు మార్లు తాను ఎమ్మెల్యేగా పనిచేశాననన్నారు. ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలతోపాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో తమ పార్టీ నాయకులే సర్పంచ్‌లు అయ్యేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

హామీలు నెరవేర్చాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మిన వారందరికి జగన్ పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా జింకా విజయలక్ష్మి, సాధారణ కుటుంబానికి చెందిన భీమునిపల్లి లక్ష్మీదేవిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. రెండు మార్లు ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఎంవీఆర్ కుటుంబానికి ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవిని ఇచ్చారని తెలిపారు. రమేష్ యాదవ్‌కు ఎమ్మెల్సీ పదవి కూడా అలానే వచ్చిందన్నారు. టీటీడీ సభ్యులుగా చిప్పగిరి ప్రసాద్, మారుతి ప్రసాద్‌లాంటి సాధారణ వ్యక్తులకు ఉన్నత పదువులు ఇచ్చిన ఘనత జగన్‌దే అని కొనియాడారు. తమ హయాంలో ప్రొద్దుటూరుకు తాగునీటి పథకం పూర్తి చేసి నీరు అందిస్తున్నామని, పార్కులు, రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. అసంపూర్తిగా ఉన్న కూరగాయల మార్కెట్ నిర్మాణం, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం లాంటి అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయిస్తే ప్రజలు సంతోష పడుతారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాగుల శాంతి, చింపిరి అనిల్ కుమార్, నూకా నాగేంద్రారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున యాదవ్, గోపవరం ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బాణా కొండారెడ్డి, మార్తల చంద్ర ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంజి పాల్గొన్నారు.

మహానాడు పేరిట తండ్రికొడుకుల నటన

చంద్రబాబు, లోకేష్‌పై జింకా విజయలక్ష్మి విమర్శలు



ప్రొద్దుటూరు : కడప గడ్డపై మహానాడని తండ్రికొడుకులు సీఎం చంద్రబాబు మంత్రి, లోకేష్ గ్లోబల్ నటన ప్రదర్శించారని వైఎస్సార్‌సీపీ పద్మశాలీయ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జింకా విజయలక్ష్మి విమర్శించారు. గురువారం ఆమె మాట్లాడుతూ చంద్రబాబులో మార్పు వచ్చింది.. జిల్లా అభివృద్ధి గురించి చెప్తారని జిల్లా ప్రజలు ఎదురు చూస్తే వైఎస్సార్ కుటుంబంపై విషం చిమ్మారని అన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ చేనేతలకు నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24వేలు అందించి ఆదుకున్నారన్నారు. ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి, అమెజాన్ వంటి సంస్థల ద్వారా ప్రపంచ స్థాయికి చేర్చారన్నారు. కరోనా కష్టకాలంలో చేనేతలనే కాదు యావత్ ప్రజానికి వైఎస్ జగన్ పథకాలను అందించి అండగా ఉన్నారన్నారు. బీసీలను అక్కున చేర్చుకొని రాజకీయాలలో తమ స్థానాలను సుస్థిరం చేసుకునేలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. యువగళం మేధావి యువ నేతగా పిలువబడే లోకేష్‌కు రాష్ట్ర ప్రజా సంక్షేమం కంటే రెడ్ బుక్ పాలనే ముఖ్యమని తేలిపోయిందన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పక్కన పెట్టి తండ్రికొడుకులు మహానాడు వేదికగా రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని జింకా విజయలక్ష్మి మండిపడ్డారు.

ఇళ్ల స్థలాల కోసం జూన్ 2న ధర్నా

ప్రొద్దుటూరు : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో గురువారం మహా ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలలో ఏ ఒక్కటి పూర్తిగా ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇచ్చిన సెంటు స్థలం రద్దు చేసి రెండు సెంట్లుగా మారుస్తామని జనవరి 29న అసెంబ్లీలో ప్రకటించారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ప్రొద్దుటూరు పేరుకే నోటిపై మండలమని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వ బంజర భూములను ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పంచన చేరి భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారన్నారు. జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ ఏరియా సమితి సభ్యులు గోపాలం రామకృష్ణ, దేవరశెట్టి నరసింహ, చంద్రశేఖర్, మీరావలి, నాయబ్ రసూల్, దస్తగిరి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆదాయం, ఆరోగ్యం



ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

మైదుకూరు : చిరుధాన్యాలతో అటు ఆదాయం, ఇటు ఆరోగ్యాన్ని పొందవచ్చని జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గురువారం మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బద్వేలు నియోజకవర్గంలోని కలసపాడు మండలంలో ప్రారంభించారు. మండలంలోని పెండ్లిమర్రి, కలసపాడు, చెన్నేపల్లె గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వి.సుబ్బరాయుడు, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ ఏవీ, డాక్టర్ ఉమాకాంత్ మాట్లాడుతూ చిరుధాన్యాల రకాలు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ వికసిత కృషి సంకల్ప అభియాన్ ఉద్దేశాలు, కార్యాచరణ ప్రణాళిక గురించి తెలిపారు. వ్యవసాయ, ఉద్యా, పశు సంవర్ధక శాస్త్రవేత్తలు, అధికారులు ఖరీఫ్ పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, యాజమాన్య పద్ధతులు, కొత్త వంగడాలు, రైతు సందేహాల గురించి వివరించారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

చాపాడు: మండల పరిధిలోని రాజువారిపేట గ్రామంలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని బుధ, గురువారాల్లో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఓల్డ్ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు, మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు హాజరైన భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

ప్రథమ స్థానంలో ప్రొద్దుటూరు ఎద్దులు

రాజువారిపేటలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దులు ద్వితీయ, అనంతపురం జిల్లా పెద్దపేరూరు మండలం వరదాయపల్లెకు చెందిన శ్రీరాములు ఎద్దులు తృతీయ, మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లెకు చెందిన మూలే సూరారెడ్డి ఎద్దులు నాల్గవ, కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల నారాయణరెడ్డి ఎద్దులు ఐదవ, కడపకు చెందిన బొజ్జ విద్య ఓబుళరెడ్డి ఎద్ల ఆరవ స్థానంలో గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

దళిత యువకులపై పోలీసుల దాడి దారుణం

బద్వేలు అర్బన్ : గుంటూరు జిల్లా తెనాలిలో ఇటీవల దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన యువకులపై పోలీసులు బహిరంగంగా చేసిన దాడి దారుణమని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, సీనియర్ దళిత నాయకుడు బి.కేశవయ్య పేర్కొన్నారు. గురువారం వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎవరైనా తప్పు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప ఇలా విచక్షణా రహితంగా నడిరోడ్డుపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించి కొట్టడం సరికాదన్నారు. తక్షణమే దళిత, మైనార్టీ యువకులపై దాడి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు పి.వెంకటరమణ, డీబీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


మహానాడుకు బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు



బస్సులు లేక బస్టాండులో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బద్వేలు అర్బన్ : జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన బహిరంగ సభకు ఆ పార్టీ కార్యాకర్తలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బద్వేలు డిపో పరిధిలో దాదాపు 60 బస్సులు ఉండగా ఇందులో 35 బస్సులను మహానాడు కార్యక్రమానికి కేటాయించారు. దీంతో బద్వేలు డిపో నుండి వివిధ ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గట్టుపల్లె, ముత్తుకూరు, సీతారామపురం, పాముూరు, బి.మఠం, మైదుకూరు, కలువాయి తదితర ప్రాంతాలకు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అలాగే కడప, నెల్లూరులకు సైతం బస్సుల సంఖ్యను కుదించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు ప్రయాణం చేసేందుకు వచ్చిన ప్రజలు బస్సు అందుబాటులో లేకపోవడంతో కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా మరి కొందరు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అందుబాటులో ఉన్న అరకొర బస్సులలో ప్రయాణించేందుకు ప్రజలు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ ఆయా గ్రామీణ ప్రాంతాలకు తిరిగే బస్సులు రద్దు కావడంతో ప్రజలు ప్రమాదకరస్థితిలో ఆటోలలో ప్రయాణం చేయక తప్పలేదు.

వృద్ధుడికి అంత్యక్రియలు



రామయ్యకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న వివేకానంద ఫౌండేషన్ సభ్యులు

పోరుమామిళ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండుతో అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించి వివేకానంద ఫౌండేషన్ మానవత్వాన్ని చాటుకుంది. ఏలూరుకు చెందిన వృద్ధ దంపతులు రామయ్య (70), కుమారి (65) కాశినాయన నిత్యాన్నదాన సత్రంలో ఆశ్రయం తీసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం రామయ్య ఆరోగ్యం క్షీణించడంతో కడప రిమ్స్‌కు వెళ్లాలని రెండు రోజుల కిందట పోరుమామిళ్ల వచ్చారు. కడపకు వెళ్లేందుకు డబ్బు లేక బస్టాండులో రెండు రోజులు ఉన్నారు. రామయ్య ఆరోగ్యం మరింత క్షీణించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. స్థానికులు వివేకానంద ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి సంస్థ ప్రతినిధులు రామయ్యకు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



బద్వేలు అర్బన్ : యోగా సాధన చేస్తున్న మున్సిపల్ కార్యాలయ సిబ్బంది



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



బి. కోడూరు: యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఆశా కార్యకర్తలు

పోరుమామిళ్ల: యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రకాష్‌రావు సిబ్బందితో కలసి ఆసనాలు, సూర్యనమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక, శారీరక ఉన్నతి సాధించగలరన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రవిచంద్ర, జాకీర్, దివ్య, నవీన్, రమణ, మోహన్‌కుమార్, సుదీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత యోగాను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు : పట్టణ ప్రజలు ఉచిత యోగా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం రోడ్డులో గురువారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీ వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి సౌజన్యంతో యోగాలో ప్రజలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు యోగా చేయడం ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతంగా చేకూరుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛంగా యోగాలో పాల్గొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న యోగాంధ్ర 2025 ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని, అది ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో ప్రతిఒక్కరు పాల్గొనేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. అనంతరం యోగా ట్రినర్లు అమర్‌నాథ్‌రెడ్డి, నందగోపాల్ నేతృత్వంలో యోగా సాధన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ

బి.కోడూరు : మండలంలో జూన్ 21 వరకు నిర్వహించనున్న యోగాపై మండల కేంద్రమైన బి.కోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పది సచివాలయాల పరిధిలోని ఒక సచివాలయానికి 9 మంది చొప్పున 90 మందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో యోగా వలన కలిగే ప్రయోజనాల గురించి, ప్రస్తుతం మారిన ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో యోగా వలన కలిగే లాభాల గురించి యోగా ట్రినర్లు వివరించారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతా చెత్తా.. కానరాని స్వచ్ఛత





స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరుతో పట్టణాలను సుందరంగా తీర్చి దిద్దాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయం నీరు గారుతోంది. బద్వేలు పట్టణంలో చెత్త తరలించే వాహనం 20 రోజులుగా మరమ్మతులకు గురవడంతో పట్టణంలో చెత్త శుద్ధి కనిపించడంలేదు. దీంతో పలు వార్డుల్లో చెత్త వ్యర్థాలు పేరుకుపోయి వీధులు దిబ్బలుగా మారాయి. అంతేకాకుండా దుర్వాసన, దోమల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పట్టణంలోని అశోక్‌నగర్, రామాంజనేయనగర్, ఎగువ బ్రాహ్మణవీధి, ఫాతిమానగర్, గాంధ్లవీధి, రాధాకృష్ణనగర్, మెయిన్ బజార్ వంటి ప్రాంతాలలో చెత్తనిల్వలు పేరుకుపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -బద్వేలు అర్బన్

పుష్పగిరి పీఠం భూముల వేలం

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ పుష్పగిరి మఠానికి చెందిన ఆస్తుల వేలం గురువారం నిర్వహించినట్లు మఠం మేనేజర్ పి.గిరిధర్ తెలిపారు. అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు గ్రామంలోని సర్వే నెంబరు 210లోగల విస్తీర్ణం ఏ7.10 సెంట్ల భూమిని వేలం వేశామన్నారు. ఉదయం స్థానిక జయనగర్ కాలనీలోని శ్రీ పుష్పగిరిమఠం మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వేలం పాట ద్వారా రూ. 2,22,000 గుత్త లభించినట్లు వివరించారు.

నేత్రదానం

వేముల : ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి అంధరహిత సమాజం కోసం పాటుపడాలని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. గురువారం మండలంలోని నారేపల్లె గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి నరసింహారెడ్డి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. రాజు టెక్నిషియన్ హరీష్‌తో కలిసి మృతుని ఇంటికి వెళ్లి మృతదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు.